# తీరని కోరిక



పి.వి.ఆర్. శివకుమార్

"ఏట్రా ఆగిపోయావ్? నడు. నడు .."

తండ్రి హెచ్చరిక వినపడటంతో ఆగిపోయినవాడల్లా నెత్తిమీద తట్ట సర్దుకుంటూ మళ్లీ ముందడుగువేశాడు చంటిగాడు. అడుగులు ముందుకే పడుతున్నాయి గానీ, వాడి కళ్లుమాత్రం వీపుకే అతుక్కుపోయి దూరమవుతున్న ఆ బోర్డునే చూస్తున్నాయి. ఆ బోర్డులో రాసివున్నదేదీ వాడు చదవలేడు. కానీ ఆ బోర్డులో ఎన్ని లైన్లు వున్నాయో, ఏ లైనులో ఎన్ని అక్షరాలున్నాయో, ఆ అక్షరాల్ని ఎన్ని రంగులు ఉపయోగించి రాశారో మాత్రం వాడికి కళ్లకి కట్టినట్టు తెలుసు. తీరిక దొరికినప్పుడల్లా తను గుడిసెకి రెండు నిమిషాల నడక దూరాన వున్న ఆ ఖాళీజాగాలోని బోర్డుదగ్గరకు పరుగెత్తి, ఆ బోర్డుని కళ్లతో తరచి, చేతుల్తో తడిమిచూసి మురిసిపోతూ వుంటాడు.

ఆ బోర్డులో ఏముందో వాడికి తెలియజెప్పిన వాడూ, వాడిలో ఆశలు రేకెత్తించిన వాడూ సూరిగాడు. సూరిగాడు చంటి కన్న అయిదారేళ్లు పెద్ద. అయినా వాళ్లిద్దరూ, సూరిగాడు తల్లిదండ్రుల్తో పాటుగా వున్నంతకాలం స్నేహంగా కలిసిమెలిసి తిరిగేవాళ్లు. ఒకసారి వాళ్ల వూరికి టూరింగ్ బైస్కోపు వచ్చింది. చంటిగాడూ, సూరిగాడూ కూడా ఆ బైస్కోపు చూడాలని ముచ్చటపడ్డారు,

కానీ, పావలా ఖర్చుచేసి పిల్లలకి బైస్కోపు చూపించే స్థితి వాళ్లిద్దరి తల్లిదండ్రులకి లేదు. పావలా లేకుండా బైస్కోపు చూడాలనే ఆశపడే సాహసం చంటిగాడికి లేదు. అయితే సూరిగాడి సంగతి వేరు. ఆరు నూరయినా, నూరు ఆరయినా అనుకున్న పని అయితీరాలనే పంతం వాడిది. అందుకే పావలా యివ్వని తండ్రిని తిడుతూ మూర్ఖ్యక, ఏదేమయితే అయిందని వట్టి చేతుల్తోనే టూరింగు డేరావైపు పరుగుతీశాడు. రెండ్రోజులు ప్రయత్నించి, డేరాముందు నిలబడి టిక్కెట్లు వసూలుచేసే వ్యక్తితో మాటకలిపాడు. నెమ్మదిగా అతణ్ణి వప్పించి, నాలుగురోజుల తరవాత డేరా గుమ్మంలోనే నిలబడి బైస్కోపు చూసే అవకాశం దక్కించుకున్నాడు. ఆ తర్వాత, ఆ వూళ్లో డేరా వున్నన్నాళ్లూ అక్కడికి వెళ్లి, ఆ వ్యక్తి ఆదరం సంపాయించి, వాళ్లతో కల్సి వూరొదిలి పారిపోయాడు. ఏడాదిపాటు వాళ్లతో తిరిగి వాళ్లు చెప్పినపనల్లా చేసి, దొరికిందేదో తిన్నాడు. ఆ తర్వాత నెమ్మదిగా ఆ జీవితంమీద మోజుతీరిపోయాక, ఓ హోటల్లో క్లీనరుద్యోగం సంపాదించాడు. రెండు, మూడు హోటళ్లు మారేక, తన వూరికి దగ్గర్లో వున్న పట్నమే చేరి సర్వరు స్థాయికి ఎదిగాడు. అప్పట్నుంచీ మళ్లా తన వూరితో సంబంధాలు పునరుద్ధరించుకున్నాడు. తోచినప్పుడల్లా వూరొచ్చి తండ్రిచేతిలో అయిదో, పదో పెట్టి వెళ్లటం అలవాటు చేసుకున్నాడు.

సూరిగాడు వచ్చినప్పుడల్లా చంటిని పోరుతూనే వున్నాడు– "నాతోపాటు పట్నం రారా! నీకూ ఏదో వో దారి చూపిస్తాను" అని. అయితే చంటిగాడికి ఆసక్తి లేదు. అందుకే ఆసక్తి లేమ పొమ్మన్నాడు. తండ్రినీ, చెల్లెల్నీ, తల్లినీ వదిలిపోవటం వాడికరం కాదు. పేడ పోగుచేసి పిడకలు కొట్టటం, తండ్రితోపాటుగా కూలిపనులకి వెళ్లటం యివి రెండే తప్ప మూడో జీవితం వాడికి తెలీదు. అందుకే సూరిగాడి జీవితానుభవం వాణ్ణి ఉత్తేజపరుస్తుండేది. అయితే, వూరు వదిలి వెళ్లటంమాత్రం వాడికి ఆలోచల్లో కూడా భరించలేని వ్యవహారం. 'పిడిహ లాభంలేద'నుకుని వాణ్ణి తనతో రమ్మని పిలవటం మానేశాడు సూరిగాడు.

ఒకసారి అలా తమ వూరొచ్చిన సూరిగాడు తను హోటల్లో పని మానేశాననీ, ఓ సినిమాటాకీసులో స్వీపర్‌గా కుదిరాననీ చెప్తుంటే నోరు వెళ్లబెట్టుకు విన్నాడు చంటి.

"హోటల్లో అయితే కడుపునిండా తిండిమాత్రం దొరికేది. ఇప్పుడు కంటినిండా సినిమాలు కూడా దొరుకుతున్నాయిరా! వారానికో బొమ్మ మారుతుంది మా హాల్లో. అన్నీ కొత్త బొమ్మలే! చూస్తుండు... చూసి, చూసి నేనే హీరో

వై పోతానో రోజు" అన్నాడు సూరిగాడు.

"హీరో అంటే?" అడిగాడు చంటి.

"హీరో అంటే " ఉత్సాహంగా చెప్పబోయి, ఆగిపోయి బుర్ర గోక్కున్నాడు సూరిగాడు. "హీరో అంటే.... అదేరా, ఎన్.టి. రామారావు, నాగేశ్వర రావు, కృష్ణ... వీళ్లా హీరోలంటే."

కళ్లు తేలేశాడు చంటి. "నువ్వు.... అంతవోడివవుతావా?... ఎట్టా?"

"అదండా అంతే! యాక్షన్... అది నేర్చుకుంటే చాలు. అదే అయిపోవచ్చు. కష్టపడితే ఎవరైనాసరే, అలాగే పైకిరావచ్చు. నీలా పల్లెటూళ్లో నే పడుంటే ఏం పైకొస్తారు?"

చంటిగాడి బుర్రకి జవాబేం తోచలేదు. సూరిగాడి సవాళ్లకి జవాబు చెప్పేపాటి పరిజ్ఞానం వాడికి లేదు. అందుకే మాట్లాడకుండా వూరుకున్నాడు.

సూరిగాడు తిరిగి పట్నం వెళ్లిపోయినా, అతడి మాటలు మాత్రం చంటిగాడి బుర్రలో రొదపెడుతూ మిగిలిపోయేయి. 'సిన్మాహాలు. స్వీపరు. రోజు రోజూ సిన్మాలు. సిన్మా హీరో..' ఆ నాలుగు మాటలూ వాడి మనసుకి హత్తుకుపోయేయి.

'స్వీపరంటే నెలనెలా జీతం యిస్తార్ట. పైగా రోజూ డబ్బులియ్యక్కర్లేకుండానే సినిమా చూడొచ్చట. వారానికో కొత్త బొమ్మ.... ఏడాది పొడుగూతా సినిమా చూస్తూ డబ్బు సంపాదించొచ్చు. అదృష్టం కలిసొస్తే.... హీరో కూడా అయిపోవచ్చు గాబోలు'- అనుకుంటూ వెర్రిగా ఆలోచనల్లో పడిపోసాగాడు.

* * *

ఆలోచనల్లోనే మిగిలిపోయిన చంటిగాడికి ఆశలు కలిగించింది మాత్రం ఆ బోర్డే. మరో నెల్లాళ్లకి గాబోలు ఆ వూరికి వచ్చిన సూరిగాడు తమ గుడిశలకి ఆనుకునివున్న స్థలంలో వెలిసిన కొత్త బోర్డుని చూసి హుషారుగా కళ్లెగరేస్తూ నవ్వాడు.

"ఒరే చంటీ, యీ బోర్డేమిటో తెల్సా?" తెలీదన్నట్టు తల అడ్డంగా తిప్పాడు చంటి.

"ఈ స్థలంలో ఓ సినిమా హాలు కట్టబోతున్నారట! ఈ స్థలం కొనుక్కున్నాయన యీ బోర్డు రాయించి పెట్టాడు. మామూలు హాలు కాదు ఏర్‌కూల్డ్.... అంటే.... బయట ఎంత మండుతున్నా సరే, లోన చల్లగాలి వీస్తావుంటుందన్న మాట. అలాటి హాలు కడుతున్నార్ట! అబ్బో యీ హాలువస్తే మనూరికి కొత్త కళొస్తుందిలే!"

"అఁ యిక్కడ సిన్మాహాలా?" నోరు తెరిచాడు చంటి.

"అవును. మనూరికే మొదటి హాలు!"

చంటిగాడికి హఠాత్తుగా గాలిలో తేలుతున్నట్టయింది.

'ఇంటి పక్కనే సినిమా హాలు



వస్తోందా! అబ్బ... ఎంతదృష్టం! తనూ సూరిగాడిలా యీ టాకీసులో ఏదయినా పని సంపాదిస్తే! తనూ రోజూ సినిమాలు చూడొచ్చు. సూరిగాడిలా డబ్బులు సంపాయించుకోవచ్చు. ఉన్నవూళ్లో సినిమాహాల్లో పనిచేస్తానంటే అయ్యకూడా ఏమనడు. డబ్బు సంపాయించటమేగా అయ్య కోరేది కూడా.

"ఏంట్రో ఆలోచనల్లో పడిపోయావ్? యీ టాకీసులో ఉద్యోగం సంపాయించాలనేనా?"

సూరిగాడి మాటలు విని ఆశ్చర్యపడ్డాడు చంటి - తన మనసులోని ఆలోచన ఎలా కనిపెట్టేశాడా అని.

"బాగుంటది కదూ సంపాదిస్తే!" అన్నాడు.

"బాగుంటమేట్రా - బ్రమ్మాండంగా వుంటుంది. నీది చాలా అదృష్ట జాతకం లాగుంది. నేను వూరొదిలిపోతేగానీ కల్సిరాని అదృష్టం, నిన్ను యిక్కడికే వచ్చి పలకరిస్తోంది!" అన్నాడు సూరిగాడు

ఆ సంతోషంలో సూరిగాడికి ఏం జవాబివ్వాలో కూడా తోచలేదు.

* * *

"ధూత్ నీ యవ్వ ఏంట్రా ఆ ఆలోచన్లు? బంగారంలాంటి పేడనంతా నేలపాలు పేశావ్. ఎత్తెత్తు... ఏర సూసుకు నడత్తున్నావ్?"

ఆలోచనల్లో మగ్నమై నడుస్తున్న చంటిగాడికి, కాలికి తగిలిన ఎదురు దెబ్బతోపాటు తండ్రి కసురు మరింత బాధపెట్టింది. గబుక్కున కింద కూర్చుని పడిపోయిన తట్టని అందుకుని, పేడ

వంతా అందులోకి చేర్చసాగాడు, 'ఇంతె న్నాళ్లు యీ కష్టాలు? ఆ సినిమాహాలు కట్టేశారంటే ఇక తన బతుకు రాజ భోగమే' అనుకుంటూ.

"అయ్యా" అన్నాడు తట్టనెత్తుకు మళ్లా నడకసాగిస్తూ.

"ఏట్రా?"

"మన గూడెం పక్కన సినిమాహాలు కడుతున్నారంట."

"ఎవరు శెప్పార్రా?"

"సూరిగాడు."

"ఆడికేటి తెలుస్రా?"

"అద బోర్డు పెట్టిన్రుగా!"

"ఆ బోర్డుల రాసుందా అట్లని?"

"అవునంట."

"ఇగ మనూరికి సిన్మ అలాకటి తక్కువైనాది. దాని గురించేనా నీ ఆలోశన్లు?"

అవునన్నట్లు మౌనంగా వుండి పోయాడు చంటి.

"అదొచ్చినప్పటెల్లి నీకు ఇగ సిన్మ చూసెతందుకు డబ్బు గావాలిర?" కోపంగా అన్నాడు.

"కాదయ్యా ..."

"మరి?"

"నేను... నేను ఆ హాల్లో పనికి కుదురకుంట. ఆ సూరిగాని లెక్క నేను కూడ పైసలు సంపాదిస్త."

ఒక్కసారి ఆగిపోయాడతని తండ్రి. కొడుకువైపు వింతగా చూశాడు.

"ఎంత మంచి ఆలోశన్రా నీది! నిజంగా నీకు అద పని గుదిర్తే ఇంకే ముందిర బిడ్డ!"

"కుదుర్తదయ్యా! నువ్వెల్లి నా తరపున అడగాలి."

"కట్టనియ్యర. అట్టనే అడుగుత. ఒరే సంటిగా, రెక్కాడితెగానీ డొక్కాడని బతుకుల్రా మనయి! రోజల్ల కట్ట పడితేనే రేత్రికి బుక్కెడు బువ్వ దొరుక్కద్ది. లేకుంటే పస్తులె గదర!"

"అందుకే, ఏడనో ఒకాడ కష్టపడాలె. పైసలు సంపాదించాలె! శిన్నప్పటాలె ఆ ఆలోశన వుండాల్రా. లేకుంటే యీ భూమ్మీద బతకలేంరా బిడ్డా!"

తలూపాడు చంటిగాడు.

* * *

ఆ రోజు ఉదయం లేచి చూసేసరికి, బోర్డువున్న స్థలంలో హడావిడిగా వుంది పరిస్థితి. పెద్ద పెద్ద వాళ్లు స్థలంలో తిరుగుతూ కనిపించారు చంటిగాడికి. పరుగులు పెడుతూ అక్కడికి వెళ్లాడు. కొలతలావ్ని టేపుల్తో కొలుస్తున్నవాళ్లు.. ముగ్గుతో లైన్లు గీస్తున్నవాళ్లు కన్పించా రక్కడ.

వాడికి సంగతి అర్థమయింది. సినిమా హాలు నిర్మాణం ప్రారంభం కాబోతోం దన్నమాట. వాడి సంతోషానికి పగ్గాలు లేవు. గబగబ పరుగెత్తుకు వెళ్లి తండ్రితో చెప్పాడు. తోబుట్టువుతో చెప్పాడు. తనే సొంతగా థియేటర్

నిర్మిస్తున్నట్టు ఉత్సాహపడిపోయాడు.

మరుసటి వారం నుంచీ ఆ స్థలంలో వస్తున్న మార్పుల్ని వెయ్యికళ్లతో పరిశీలించటం ప్రారంభించాడు. రెండు మూడు వారాల్లో పునాదులు తవ్వటం పూర్తయింది. ఒకొక్క అడుగు పునాది తవ్వకం జరుగుతుంటే తన భవిష్యత్తుకి ఒకొక్క మెట్టు ఏర్పడుతున్నట్టు వూహించుకోసాగాడు వాడు.

సూరిగాడు వచ్చి జరుగుతున్నదంతా చూశాడు. వాడిలోనూ వుత్సాహం కలిగింది.

"యీ హాలు పూర్తయాక వీలయితే నేను గూడా ఇక్కడికే వచ్చి పని చేస్తాన్రా. ఇద్దరం కలిసి పనిచేసుకోవచ్చు" అన్నాడు చంటిగాడితో. చంటిగాడి ఆనందం మరింత పెరిగింది.

రోజులు గడిచేకొద్దీ వాడి ఆశా సౌధాలు సినిమా థియేటర్ గోడల్లాగే ఎదగసాగాయి.

* * *

రెండు నెలలు గడిచాయి. సినిమా థియేటర్ ఒక ఆకారానికి వస్తోంది.

ఆ రోజు పొద్దున తొమ్మిది గంటల వేళ హఠాత్తుగా వచ్చి ఆగిన జీపు లోంచి వాన్లల్లోంచి బిలబిల దిగారు పోలీసులూ అధికార్లూ.

గూడెంలోని జనమంతా వెంటనే ఖాళీచేసి వెళ్లాలి, లేదా బలవంతంగా గుడిసెల్ని నేలమట్టం చేయవల్సి వుంటుందనీ అల్టిమేటం యిచ్చారు.

అంతకు నెలరోజుల ముందునుంచే గూడెంవాళ్లకీ, ఆ స్థలం యజమానికీ జరుగుతున్న తర్జనభర్జనలకీ, కోర్టు కేసుకీ పతాక సన్నివేశం ఆ సంఘటన.

"మనం ఎందుకు వెళ్లిపోవాలయ్యా ఇక్కణ్ణించి?" అడిగాడు చంటిగాడు తండ్రిని.

"ఈ స్థలం మనిది కాదు గనక! అప్పుడు పట్టాలిస్తామని ఓట్లు గుంజుకుని గుడిసెలేసుకోనిచ్చారు. ఇప్పుడు స్థలం కొన్న సావుకారు స్థలం తనదని కోర్టుకి పొయ్యాడు. మనని లేచిపొమ్మంటున్నారు!"

"ఈ స్థలం ఎవరిదయ్యా?"

"అగ్గో- ఆ సిన్మాహాలు కడుతున్న షావుకారే యీ స్థలంగూడ కొన్నాడంట- సిన్మాహాలుకి ఆ స్థలం సాల్దంట- యిది గూడ కలిపితే, పెద్ద జాగా అవుతదంట- ఆయనే కోర్టులో కేసు తీసిండు-"

* * *

సినిమాహాలు అందాల్ని సంతరించుకుంటున్న వేళ.

గుడిశవాసులంతా తట్టబుట్టల్ని సర్దుకుని ఆ స్థలం ఖాళీచేసి కదిలి పోసాగారు. ఆ సినిమా థియేటరు కేసి చూస్తూ తండ్రివెంటే నడుస్తున్న చంటిగాడి కళ్లలో నీళ్లుతిరిగి, తన ఆశా సౌధాలు ఫెళఫెళా కూలి పడుతున్నట్లనిపించింది!